

ప్రారంభమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

పుష్పగిరిలోని కామాక్షీ వైద్యనాథేశ్వర, లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. - 8లో



నేను మోనార్క్‌ను...

ప్రచారమైనా.. పబ్లిక్ మీటింగైనా దూకుడు ప్రదర్శిస్తూ... నేను మోనార్క్‌ను నన్నెవ్వరూ కంట్రోల్ చేయలేరన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు కడప టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డి. - 10లో

గరిష్టం/కనిష్టం
45.4/31.6

వాతావరణం

జిల్లాలో సోమవారం 31.6 – 45.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.3 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కడప వాసికి బిజినెస్ మేనేజ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న శిరీష

కడప కల్చరల్ : కడపకు చెందిన ప్రముఖ విద్యావేత్త అలపర్తి పిచ్చయ్యచౌదరి, దుర్గాకుమారిల కుమార్తె శిరీషకు ప్రతిష్టాత్మక బిజినెస్ మేనేజ్‌మెంట్ అవార్డు–2024 లభించింది. అమెరికాలోని బ్లూ క్రాస్ సీనియర్ మేనేజర్‌గా ఆమె ఈ అవార్డును అందుకున్నారు. అలపర్తి శిరీష కడప విద్యామందిర్ హైస్కూలులో విద్యను అభ్యసించారు. శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో బీఎస్సీ కంప్యూటర్స్ చేశారు. పది సంవత్సరాలుగా డెట్రాయిట్‌లోని బ్లూ క్రాస్ ఇన్సూరెన్స్ కంపెనీలో పనిచేస్తున్నారు. గతంలో ఆమె మైక్రోసాఫ్ట్, సియాటెల్ సంస్థల్లో కూడా పనిచేశారు.

15 నుంచి వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు



కడప స్పోర్ట్స్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ పరిధి ఆధ్వర్యంలో ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి కె. జగన్నాథరెడ్డి తెలిపారు. వేసవి తీవ్రత, సాధారణ ఎన్నికల నిర్వహణ నేపథ్యంలో మేనెల 1 నుంచి నిర్వహించాల్సిన వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు 15 నుంచి నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో 50 వేసవి క్రీడాశిక్షణ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 8 నుంచి 14 సంవత్సరాలలోపు వయసు గల విద్యార్థులు ఈ వేసవి క్రీడాశిక్షణ శిబిరాల్లో పాల్గొనవచ్చని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



యాత్రికుడికి వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ నాగరాజు

కడప రూరల్: జిల్లా నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి సోమవారం స్థానిక రాధాకృష్ణనగర్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా నుంచి మొత్తం 234 మంది హజ్ యాత్రకు వెళుతున్నట్లు తెలిపారు. అందులో భాగంగా రాధాకృష్ణనగర్ పట్టణ ఆరోగ్యకేంద్రంలో 12 మందికి వ్యాక్సినేషన్ వేశామన్నారు. మిగిలిన వారికి 9వ తేదీన వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, అర్బన్ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఉబేదుల్లా, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సుమధుర, సీహెచ్ఓ మునిరెడ్డి పాల్గొన్నారు.

షర్మిల.. ఎందుకిలా..!

- పీసీసీ అధ్యక్షురాలి వైఖరితో దూరమవుతున్న పార్టీ కేడర్
- తొలివిడత ప్రచారంలో కనిపించిన తులసిరెడ్డి మలివిడతలో లేరు
- బీజేపీని దూషిస్తూనే ఆదితో రహస్య మంతనాలు
- పార్టీలోనూ.. కుటుంబంలోనూ ఒంటరిగానే..



సాక్షి ప్రతినిధి, కడప: రాజన్న ఉండి ఉంటే రాష్ట్రం విడిపోయే అవకాశం లేదని ఇప్పటికీ ఆంధ్రప్రదేశ్ వాసులు విశ్వసిస్తున్నారు. ప్రజల ఆకాంక్షతో నిమిత్తం లేకుండా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని రెండు ముక్కలుగా విభజించింది. కాంగ్రెస్ అంటేనే ఏపీలో ప్రజలు ఏవగించుకునే పరిస్థితి. అలాంటి పార్టీకి అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన షర్మిల వ్యవహారశైలి కూడా ఏకపక్ష ధోరణిని ప్రతిబింబిస్తోంది. జిల్లాలో, రాష్ట్రంలో అంతా తానే అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎప్పటి నుంచో కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్న నాయకులు సైతం క్రమంగా దూరమవుతున్నారు. అనతికాలంలోనే వామ్మో షర్మిల అనే పరిస్థితి తయారైందని పరిశీలకులు భావిస్తున్నారు.

పదేళ్లుగా కాంగ్రెస్ పార్టీకి కేరాఫ్ అడ్రస్‌గా నజీర్ అహమ్మద్ పేరు విన్పించేది. షర్మిల బాధ్యతలు చేపట్టిన అనతికాలంలోనే నజీర్ అహమ్మద్ ఆ పార్టీకి దూరమయ్యారు. రాజంపేట పార్లమెంటు అభ్యర్థిగా ఆయన పేరు ప్రకటించి తర్వాత తెలంగాణకు చెందిన ఎస్కే బాషిద్‌ను ఎంపిక చేశారు. కారణాలు వెల్లడించకుండానే అభ్యర్థిని మార్చు చేయడంతో నజీర్ అహమ్మద్ కాంగ్రెస్ పార్టీకి దూరమయ్యారు. పైగా హైదరాబాద్‌లో స్థిరపడిన బాషిద్ ఎంపిక వెనుక డబ్బు మూటలు చేతులు మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. కడప నగరానికి చెందిన బండి జకరయ్య పరిస్థితి అదే. కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి తాళాలు వేసిన సందర్భంలో సైతం ఆ పార్టీ జెండాను జకరయ్య వీడలేదు. పైగా కడప అభ్యర్థిత్వం రాత్రికి రాత్రే మార్పు చేశారు. జయరాజ్ గార్డెన్స్‌లో ఓ టీడీపీ నాయకుడితో ప్రత్యేక భేటీ అనంతరం వైఎస్సార్‌సీపీ నేతగా ఉన్న అఫ్జల్‌ఖాన్ తెరపైకి వచ్చారు. షర్మిల అంటే కాస్తో కూస్తో గౌరవం ఉన్నవారు కూడా ఆమె ఏకపక్ష చర్యలపై విస్తుపోతున్నారు.

తొలి విడత ప్రచారంలో ఉన్న తులసిరెడ్డి ఎక్కడ..?

కడప పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేసిన షర్మిల తొలివిడత ప్రచారంలో డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి వెన్నంటే పర్యటించారు. జిల్లా వాసులకు పరిచయం చేస్తూ ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో తిరిగారు. రెండవ విడత ప్రచారంలో తులసిరెడ్డి ఎక్కడా లేరు. తన కంటే వాగ్ధాటి పటిమ ఉన్న తులసిరెడ్డిని కావాలనే దూరం పెట్టినట్లు తెలుస్తోంది. పైగా ఈ మారు షర్మిల పర్యటన కనీస సమాచారం కూడా లేనట్లు విశ్వసనీయ సమాచారం. మరో క్రియాశీలక మైనార్టీ నాయకుడు సత్తార్ పరిస్థితి కూడా అంతే అన్నట్లుగా ఉంది. వీరంతా షర్మిల కంటే ముందు కాంగ్రెస్ గళాన్ని జిల్లాలో విన్పించిన నాయకులు. ఇప్పుడు వారంతా షర్మిల వ్యవహార శైలి కారణంగా పట్టుమని పక్షం రోజుల వ్యవధిలో అంటీముట్టనట్లు ఉండిపోవాల్సిన పరిస్థితి తలెత్తిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

బీజేపీ అంటే మండిపాటు.. ఆదితో రహస్య మంతనాలు..

భారతీయ జనతా పార్టీ అంటేనే పీసీసీ అధ్యక్షురాలు మండిపడుతున్నారు. కానీ జిల్లాలో జమ్మలమడుగు బీజేపీ అభ్యర్థి చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డితో సత్సంబంధాలు ఉన్నాయని, రహస్య మంతనాలు చేస్తున్నారని కాంగ్రెస్ వాదులు వాపోతున్నారు. ఇటీవల షర్మిల భర్త మొరుసుపల్లి అనిల్‌కుమార్ దేవగుడిలో ప్రత్యక్షంగా ఆదితో సమావేశమైనట్లు తెలుస్తోంది. జమ్మలమడుగు ప్రచారానికి వెళ్లిన ఆమె దేవగుడి సమీపంలో రహదారి పక్కన ఉన్న గోడౌన్ల వద్ద రాజకీయ చర్చలు సాగించినట్లు పలువురు వివరిస్తున్నారు. ఈ ద్వంద్వ వైఖరితోనే సమస్య వస్తోందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కుటుంబంలో ఒంటరిగానే...

వైఎస్ కుటుంబంలో షర్మిల ఒంటరిగా కాంగ్రెస్ పార్టీలో మిగిలారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరులు వైఎస్ సుధీకర్ రెడ్డి, వైఎస్ రవీంద్రనాథరెడ్డి వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూనే మరోమారు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ జిల్లా వాసుల మద్దతు కోరుతున్నారు. మేనల్లుడు యువరాజ్, మేనకోడలు దివ్య, సమీప కుటుంబ సభ్యులంతా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం కోసం పనిచేస్తున్నారు. షర్మిల మాత్రమే కాంగ్రెస్‌లో కొనసాగుతున్నారు. కాంగ్రెస్‌లో సైతం ఒంటెత్తు పోకడలతో కేడర్‌కు దూరమవుతున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

ఉచితంగా .. కార్పొరేట్ చదువు

- ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పేద పిల్లలకు ఉచిత విద్య
- తొలి విడత జిల్లాలో 628 మందికి ప్రవేశం
- ఐదేళ్లు నిండిన వారు 1వ తరగతిలోప్రవేశానికి అర్హులు



కడప ఎడ్యుకేషన్: ఒకప్పుడు ఉన్నత వర్గాలకే పరిమితమైన ప్రైవేటు, కార్పొరేట్ విద్యను నేడు ప్రభుత్వం పేద పిల్లలకు సైతం చేరువ చేసింది. రూపాయి ఖర్చు లేకుండా 1వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఖరీదైన, నాణ్యమైన విద్య ఉచితంగా అందిస్తోంది. ప్రతి ఏటా జిల్లాలో ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు పేదవారికి దక్కనున్నాయి. ఈ పథకం కింద గత ఏడాది తొలివిడతలో 417 మందికి అవకాశం కల్పించగా ఈ ఏడాది 628 మందికి అవకాశం లభించనుంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన పిల్లలకు ఉన్నత చదువులు అందనుండటంతో వారి కుటుంబాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

విద్యాహక్కు చట్టం ప్రకారం..

విద్యాహక్కుచట్టం ప్రకారం కార్పొరేట్, ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇందులో జిల్లా వ్యాప్తంగా 460 ప్రైవేటు పాఠశాలలు ఉండగా వాటిలో 25 శాతం సీట్లను ఉచిత విద్యకు కేటాయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఇందుకు జిల్లాలోని పలు పాఠశాలల యాజమాన్యాలు అంగీకరించి విద్యాశాఖ వద్ద రిజిస్ట్రేషన్ చేయించుకున్నాయి. 5 ఏళ్లు నిండిన వారికి మాత్రమే 1వ తరగతిలో ప్రవేశం కల్పిస్తుండగా రిజిస్ట్రేషన్ల ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తున్నారు.

30 మండలాల పరిధిలో..

ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లలో భాగంగా జిల్లాలోని 30 మండలాల పరిధిలో 628 మంది విద్యార్థులకు లాటరీ పద్ధతిలో మొదటి విడత సీట్లు ఎంపిక చేశారు. వీరంతా ఈ నెల 7వ తేదీలోగా పాఠశాలల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలను పొందాల్సి ఉంది. ఎంఈఓలు ప్రత్యేక శ్రద్ధ చూపి ఎంపికైన విద్యార్థులు ఆయా పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకోవాలని డీఈఓ మర్రెడ్డి అనురాధ ఆదేశించారు. ఇందులో అత్యధికంగా జిల్లా కేంద్రమైన కడపలో 236 మంది ఎంపికయ్యారు. అలాగే ప్రొద్దుటూరులో 130 మంది, పోరుమామిళ్లలో 29, ఎర్రగుంట్లలో 25, జమ్మలమడుగులో 23, గోపవరంలో 20 మంది విద్యార్థులు పలు పాఠశాలల్లో అడ్మిషన్లు పొందారు. వీరందరికి ప్రభుత్వమే ఫీజులు చెల్లించనుంది.

రిజర్వేషన్లు ఇలా..

ఆర్‌టీఈ చట్టం ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్లను పేద పిల్లలకు కేటాయించాలని ఉంది. 1వ తరగతిలో మాత్రమే ఈ అడ్మిషన్లు ఉంటాయి. ఐబీ, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, స్టేట్ సిలబస్‌లను బోధించే అన్ని రకాల గుర్తింపు పొందిన ప్రైవేటు, అన్ ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, సీడబ్ల్యూఎస్ఎన్ వర్గాలకు ఈ సీట్లు కేటాయిస్తారు. అనాథ పిల్లలు, హెచ్ఐవీ బాధితులు, దివ్యాంగులు వంటి ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటున్న వర్గాల వారికి 5 శాతం, ఎస్సీలకు 10 శాతం, ఎస్టీలకు 4 శాతం బలహీన వర్గాలకు చెందిన బీసీ, మైనారీ, ఓసీ అంటే రూ.1,20,000 సంవత్సర ఆదాయం కలిగిన పట్టణ ప్రాంత విద్యార్థులకు, రూ. 1,44,000 సంవత్సర ఆదాయం కలిగిన పట్టణ ప్రాంత విద్యార్థులకు 6 శాతం రిజర్వేషన్లు వర్తించనున్నాయి. ఏప్రిల్ 1వ తేదీ 2018 నుంచి 31 మార్చి, 2019 మధ్య జన్మించిన పిల్లలు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ పాఠశాలల్లో ప్రవేశానికి అర్హులు. స్టేట్ సిలబస్ పాఠశాలల్లో ప్రవేశానికి జూన్ 1వ తేదీ 2018 నుంచి 30 జూన్ 2019 మధ్య జన్మించిన వారై ఉండాలి.

సజావుగా పోస్టల్ బ్యాలెట్

కడప సెవెన్‌రోడ్స్: సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించే పోలీసు పర్సనల్స్‌తోపాటు అత్యవసర సర్వీసులకు చెందిన ఉద్యోగులకు సోమవారం జిల్లాలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వినియోగించుకునే కార్యక్రమం సజావుగా సాగింది. జిల్లాలోని ఆయా అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్లలో పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. ఆదివారం ప్రిసైడింగ్ అధికారులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలకు నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లో 12,138 మంది పాల్గొని తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇతర జిల్లాలకు చెందిన ఉద్యోగులు 1141 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారు. ఇంకా మిగిలిపోయిన వారు సోమవారం ఓటింగ్‌లో పాల్గొన్నారు.

హోమ్ ఓటింగ్: జిల్లాలో తొలిసారి సోమవారం హోమ్ ఓటింగ్ కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. జిల్లాలో 85+ ఓటర్లు 7365, పీడబ్ల్యూడీ ఓటర్లు 18,532 మంది ఉండగా 878 మందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని కల్పించారు. పీఓ, ఏపీఓ, ఓపీఓలు బందోబస్తుతో ఓటర్ల ఇంటి వద్దకు వెళ్లి పోస్టల్ బ్యాలెట్ అందజేశారు. ఓటర్లు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకున్నారు. కడప నగరంలో 92 మంది ఓటర్లకుగాను 88 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. మిగిలిన వారిలో ముగ్గురు మృతి చెందగా, ఒకరు అందుబాటులో లేరు.





పోస్టల్ బ్యాలెట్ ఉపయోగించుకుంటున్న ఉద్యోగిని, ఇంటిలో ఓటుహక్కును వినియోగించుకుంటున్న వృద్ధుడు

మేలు చేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



నందిమండలం వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలకు స్వాగతం పలుకుతున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



చింతకొమ్మదిన్నెలో రోడ్ షోలో పాల్గొన్న కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డి

- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి
- నందిమండలంలో భారీ బైకు ర్యాలీ, రోడ్‌షో

పెండ్లిమర్రి: అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మేలు చేసిన జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. సోమవారం పెండ్లిమర్రి మండలం నందిమండలం పాపాఘ్ని బ్రిడ్జి వద్ద నుంచి నందిమండలం గ్రామం వరకు భారీ బైకు ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో చెప్పిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని కొన్ని వందల హామీలు ఇచ్చి వాటిని అమలు చేయకుండా మేనిఫెస్టోను చెత్త బుట్టలో వేసి ప్రజలను మోసం చేసిన వ్యక్తి చంద్రబాబు అన్నారు. అలాంటి వ్యక్తిని నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు. చంద్రబాబుకు లేనిది.. జగనన్నకు ఉన్నది ప్రజాబలం, విశ్వసనీయత అన్నారు. చంద్రబాబు ప్రకటించింది సూపర్ సిక్స్ కాదని అందమైన ఆరు అబద్ధాలన్నారు. కొప్పర్తి పారిశ్రామిక వాడలో వచ్చే ఐదేళ్లలో లక్ష మందికి ఉద్యోగాలు కల్పించాలనేది జగన్ లక్ష్యమన్నారు.

- తొలుత ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి, రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, ప్రభుత్వ పరిశ్రమల సలహాదారు రాజోలు వీరారెడ్డి, నందిమండలం ఇన్‌చార్జి సునీత మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, మండల కన్వీనర్ చంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి శివశంకర్‌రెడ్డి, ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, మాజీ ఎంపీపీ అనురాధ, ఎంపీటీసీ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సాగాలంటే మళ్లీ జగనే రావాలి

చింతకొమ్మదిన్నె: సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి సీఎంగా వైఎస్ జగన్‌ను ఎన్నుకోవాలని ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, జెడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డి అన్నారు. సోమవారం కడప నగర పరిధిలోని 16,17,18 డివిజన్‌లలో రోడ్ షో నిర్వహించారు. అలాగే చింతకొమ్మదిన్నెలో ప్రచారం చేపట్టారు. డిప్యూటీ మేయర్ బండి నిత్యానంద రెడ్డి, 16వ డివిజన్ ఇన్‌చార్జి నాగిరెడ్డి ప్రసాద్ రెడ్డి, 17వ డివిజన్ కార్పొరేటర్ చంద్రహాసరెడ్డి, మండల కన్వీనర్ గూడ ప్రభాకర్ రెడ్డి, జేఏసీ చైర్మన్ గుత్తిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, కో కన్వీనర్ కళా యాదవ్, మండల ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, ఈడిగ కార్పొరేషన్ డైరెక్టర్ కృష్ణయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ హరీంద్రనాథ్ పాల్గొన్నారు.

ప్రచారం.. సకుటుంబ సమేతం

ప్రచార పర్వం



వేముల మండలం వేల్పుల కాలనీలో వైఎస్సార్‌సీపీ తరపున ప్రచారం నిర్వహిస్తున్న ఈసీ దినేష్‌రెడ్డి, మండల ఇన్‌చార్జి సాంబశివారెడ్డి



కడపలో ప్రచారం నిర్వహిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా సతీమణి ఫాతిమా



మైదుకూరు: ఇంటింటి ప్రచారంలో శెట్టిపల్లె కవిత రెడ్డి, శెట్టిపల్లె విష్ణు ప్రియా రెడ్డి



ప్రొద్దుటూరు : ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సతీమణి సమతారెడ్డి



ఎర్రగుంట్ల: ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి సతీమణి క్రాంతిప్రియారెడ్డి



కలసపాడు : తెల్లపాడులో ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి కుమారుడు ఆదిత్యరెడ్డి

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల ప్రచార పర్వం జోరందుకుంది. బరిలో నిలిచిన అభ్యర్థులకు మద్దతుగా కుటుంబ సభ్యులు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. ఇందులో మరీ ముఖ్యంగా అభ్యర్థుల సతీమణులు, సోదరులు, కుమారులు, కుమార్తెలు ఇలా ఎవరి పరిధిలో వారు ఆయా నియోజకవర్గాల్లో తమ వారి విజయం కోసం మండుటెండల్లో చెమటోడుస్తున్నారు. తెల్లవారింది మొదలు కార్యకర్తలను వెంటేసుకుని గడప గడపకు తిరుగుతున్నారు. వీధి వ్యాపారులను కలుస్తున్నారు. సామాన్యుల వద్దకు వెళుతున్నారు. కార్మికులు, కర్షకులు, వృద్ధులు ఇలా వివిధ వర్గాల వారితో ఆత్మీయంగా మమేకమవుతున్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజలకు తమ కుటుంబ సభ్యులు చేసిన సేవలను వివరిస్తున్నారు. పలు కుటుంబాలతో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు అభ్యర్థులు ఎలాగైతే కష్టపడుతున్నారో అదే తరహాలో వారి కుటుంబ సభ్యులు కూడా ఓట్ల కోసం శ్రమిస్తున్నారు. మొత్తానికి ఎన్నికల ప్రచారం సకుటుంబ సపరివార సమేతంగా సాగుతుండటం ఆసక్తికరంగా మారింది.– సాక్షి నెట్‌వర్క్

కల్యాణం..కమనీయం



ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వేకువ జామున అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవికి కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా అలకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం గంగారాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని వేద పండుతులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మెస్ దగ్ధం



పోరుమామిళ్ల : పట్టణ శివారులో మైదుకూరు రోడ్డులో ఉన్న గాన్విక మెస్ సోమవారం సాయంత్రం పూర్తిగా దగ్ధమయింది. విద్యుదాఘాతంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. మెస్ ముందు వైపు బోద గడ్డితో నిర్మించడం, సాయంత్రం గాలి పెద్దగా రావడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి రెండు నిర్మాణాలు కాలిపోయాయి. అందులో ఉన్న పాత్రలు, వంట సామగ్రి, కిరాణా సరుకులు, కూరగాయలు కాలిపోయాయి. రూ. 4 లక్షలు నష్టం జరిగిందని.. మెస్ ఓనర్ అవుకు మనోహర్ వాపోయాడు.

జోరుగా చేరిక.. విజయమే మిగిలిందిక!

వైఎస్సార్ సీపీలోకి చేరికలు సాగుతూనే ఉన్నాయి. ఇక్కడా అక్కడా అన్న తేడాలేకుండా ప్రతిరోజూ ప్రతి నియోజకవర్గంలోనూ చేరికలు జోరందుకున్నాయి. చేరికల జోరు చూసిన ఆ పార్టీ శ్రేణులు ఇక విజయం ఖాయమని మరింత ఉత్సాహంగా ముందుకుసాగుతున్నారు.



మైదుకూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి



కడప : పార్టీలో చేరిన టీడీపీ నాయకులతో మేయర్ సురేష్ బాబు



బద్వేలు : వైఎస్సార్‌సీపీలో చేరిన కుటుంబాలతో ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



కడప : రాజగోపాల్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం

టీడీపీ నుంచి 70 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలోకి

మైదుకూరు : ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి సమక్షంలో సోమవారం ఖాజీపేట మండలం చెముళ్లపల్లెకు చెందిన 70 కుటుంబాల వారు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, కేసీ కాలువ డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ రెడ్యం చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెముళ్లపల్లెకు చెందిన రెడ్డి బయపురెడ్డి, రెడ్యం నారాయణరెడ్డి, రెడ్యం జోగిరెడ్డి, ఉదయగిరి ఎద్దులయ్య, బేతంచెర్ల సుభాన్‌బాషా, గోటూరు సుబ్బరాయుడు, ములపాక సుబ్బయ్య, ములపాక నారాయణరెడ్డి, రెడ్డి వెంకటసుబ్బారెడ్డి, రెడ్డి మోహన్‌రెడ్డి, రమేష్, బాలుడు, సుబ్బడు, లక్ష్మయ్య, గంగయ్య, కోగటం నాగసుబ్బయ్య తదితర 70 కుటుంబాల వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలను వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. చెముళ్లపల్లె సర్పంచ్ ములపాక బుజ్జి, మాజీ సర్పంచ్ వేమిరెడ్డి గురివిరెడ్డి, ఏటూరు మాజీ సర్పంచ్ ఏనుగు రాజగోపాల్‌రెడ్డి, ఆర్‌బీకే వైస్ చైర్మన్ పోతుగంటి దస్తగిరి, వెల్తూరు దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రొద్దుటూరు : రాజుపాళెం మండలంలోని కూలూరు గ్రామానికి చెందిన కాసా శ్రీనివాసులరెడ్డి, కానాల మహ్మద్ నాజి అనే రెండు కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. సోమవారం పట్టణంలోని రాయల్‌కౌంటీలో జరిగిన కార్యక్రమంలో వారికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పార్టీ కండువాలు వేసి వైఎస్సార్‌సీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. మాజీ ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీధర్, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బారెడ్డి, మోహన్‌రెడ్డి, నాగేష్, తిరుపతి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఫిట్టర్ రఫిక్ వైఎస్సార్‌సీపీలో చేరిక

ప్రొద్దుటూరు : స్థానిక మైదుకూరు రోడ్డులోని దస్తగిరి పేటకు చెందిన ప్రముఖ టీడీపీ నాయకుడు ఫిట్టర్ రఫిక్ సోమవారం సాయంత్రం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆయనతోపాటు మొత్తం 30 కుటుంబాలు పార్టీలో చేరాయి. 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి చాను, అబ్దుల్లా, మినర్వా టైర్స్ యజమాని కోగటం అమీర్ హంజా, కసిరెడ్డి మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వంద ముస్లిం కుటుంబాలు

బద్వేలు అర్బన్ : మున్సిపాలిటీ పరిధిలోని 13, 14వ వార్డుల్లో టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఉమర్, ఆ వార్డు ఇన్‌చార్జి మౌలాలి ఆధ్వర్యంలో సోమవారం టీడీపీకి చెందిన షేక్‌మహమ్మద్, జాఫర్, సాదక్, నాయబ్‌లతో పాటు 100 కుటుంబాలు టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరాయి. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు సుందర్‌రామిరెడ్డి, కేశవరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ సాయిక్రిష్ణ, కౌన్సిలర్ హసన్, మైనార్టీ నాయకులు బాబ్జీ, షఫి, నూరుల్లా, నాసర్, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాష, జబీవుల్లా, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

కడప కార్పొరేషన్ : కడప నగరంలో 30, 48 డివిజన్లకు చెందిన టీడీపీ నాయకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. 48వ డివిజన్‌లో టీడీపీ నాయకుడు రాజగోపాల్ వారి అనుచరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే 30వ డివిజన్‌లో టీడీపీ నాయకుడు వెంకటేష్, అతని మిత్రులు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు బంగారు నాగయ్య యాదవ్, డాక్టర్ ఓబుల్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, కార్పొరేటర్ షఫీ పాల్గొన్నారు.

టీడీపీ నుంచి 20 కుటుంబాలు చేరిక

కడప నగరంలోని 2వ డివిజన్‌లో 20 కుటుంబాలకు చెందిన వారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం 2వ డివిజన్ కార్పొరేటర్ సుబ్బారెడ్డి, రాజగోపాల్ రెడ్డి, పూసల కార్పొరేషన్ డైరెక్టర్ విజయకుమారి, బీసీ నాయకులు మనోజ్ ఆధ్వర్యంలో మేయర్ సురేష్ బాబు సమక్షంలో వారు వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. పార్టీలో చేరిన వారిలో కొండేటి సుధాకర్, నరసింహులు, సురేంద్ర, రామ చంద్రయ్య, రవి, గోపి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాల కొండయ్య,కువైట్ సుబ్బారెడ్డి , రాజేంద్ర, సుధాకర్ ,ప్రభాకర్ పాల్గొన్నారు.



ప్రొద్దుటూరు : ఫిట్టర్ రఫిక్‌కు కండువా వేసి వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న అబ్దుల్లా



కడప :టీడీపీ నాయకుడు వెంకటేష్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా



ప్రొద్దుటూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

వడ దెబ్బతో వ్యక్తి మృతి

రాజుపాళెం : మండల కేంద్రమైన రాజుపాళెం గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన బందెల సంజన్న (61) వడదెబ్బకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పింఛన్ డబ్బు తీసుకునేందుకు మూడు రోజులుగా తిరుగుతుండేవాడు. ఈక్రమంలో ఆదివారం ఎండ వేడి ఎక్కువగా ఉండటంతో వడదెబ్బకు గురై మృతి చెందాడు. సంజన్నకు భార్య మరియమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

రాలిపోయిన మరో పండుటాకు

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల గిరినగర్ కాలనీకి చెందిన కంభంపాటి ఓబులమ్మ(84) సోమవారం వడదెబ్బ కారణంగా మృతి చెందింది. ఆది, శని వారాల్లో ఇద్దరు మృతి చెందగా సోమవారం మరో పండుటాకు రాలిపోయింది. యువనేత డీసీ ఆదిత్యారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లి కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు.


8న ప్రపంచ తలసీమియా దినోత్సవం



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఈ నెల 8న కడప టౌన్ బుక్ సెల్లర్స్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ప్రపంచ తలసీమియా దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. తలసీమియా డే సందర్భంగా రిమ్స్ హాస్పిటల్ సహకారంతో తలసీమియా పిల్లలకు రక్తదాన శిబిరం నిర్వహిస్తామన్నారు. ప్రపంచవ్యాప్తంగా నేడు ప్రజానీకాన్ని భయపెడుతున్న వ్యాధుల్లో తలసీమియా ఒకటి. కేవలం జన్యుపరంగానే వచ్చే ఈ వ్యాధి నియంత్రణకు అనేక పరిశోధనలు కొనసాగుతున్నాయన్నారు. మనదేశంలో మూడు కోట్ల యాభై లక్షల మందికి పైగా తలసీమియా బారినపడ్డారన్నారు. తల్లిదండ్రుల్లో ఉండే జన్యుపరమైన లోపాల వల్లగానీ, జన్యువుల్లో వ్యత్యాసాల వల్లగానీ ఈ వ్యాధి సంక్రమిస్తుందన్నారు. కడప టౌన్ బుక్ సెల్లర్స్ జిల్లా గౌరవ అధ్యక్షుడు మైలాపురం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.


గాలివానకు నేలకూలిన చెట్లు



కడప - బద్వేలు ప్రధాన రహదారిపై నేలకూలిన వేపచెట్టు

అట్లూరు : అట్లూరు మండల పరిధిలో సోమవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించాయి. గాలికి అట్లూరు, రెడ్డిపల్లె, కొండూరు గ్రామాల్లో పలు చెట్లు కూలిపోయాయి. పలు విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరగడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కడప - బద్వేలు ప్రధాన రహదారిపై అట్లూరు పోలీసుస్టేషన్ ఎదురుగా వేపచెట్టు రోడ్డుపై అడ్డంగా పడటం, విద్యుత్ వైర్లు తెగిపడటంతో గంట పాటు రాకపోకలు నిలిచి పోయాయి. స్థానిక ఎస్ఐ కె.సి.రాజు స్థానికుల సహాయంతో చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధరించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



వ్యక్తి మృతదేహం

వల్లూరు : కడప– తాడిపత్రి ప్రధాన రహదారిపై విమానాశ్రయం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. విమానాశ్రయం సమీపంలో రోడ్డు దాటుకుంటున్న గుర్తు తెలియని వ్యక్తిని కడప వైపు నుంచి యర్రగుంట్ల వైపుకు వెళుతున్న లారీ ఢీ కొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ వెంకట రమణ మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలు

చెన్నూరు : మండలంలోని చిన్న మాచుపల్లి పరిధిలో గల రుద్రభారతి పేట వద్ద సోమవారం మధ్యాహ్నం డివైడర్‌ను ఢీకొని పోలీస్ కానిస్టేబుల్ కృష్ణ నాయక్‌కు తీవ్ర గాయాలయినట్లు చెన్నూరు పోలీసులు తెలిపారు. కమలాపురం పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ గా పనిచేస్తున్న కృష్ణ నాయక్ పోస్టల్ బ్యాలెట్ ఓటు హక్కును వినియోగించుకోవడానికి తన ద్విచక్ర వాహనంలో కమలాపురం నుంచి కడపకు వస్తుండగా రుద్రభారతి పేట వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో అతడికి గాయాలు అయ్యాయని పోలీసులు తెలిపారు. చికిత్స నిమిత్తం అంబులెన్స్ ద్వారా కడపకు తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

772 ఫిర్యాదులకు పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై మొత్తం 775 ఫిర్యాదులు అందగా 772 ఫిర్యాదులకు పరిష్కారం అందించామని జిల్లా ఎన్నికల అధికారి విజయరామరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వేర్వేరు వేదికల ద్వారా అందిన ఫిర్యాదులపై జిల్లా ఎన్నికల అధికారి ఆధ్వర్యంలో చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టరేట్ లోని జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ సెంటర్ ఫిర్యాదుల పరిష్కార నివేదికను విడుదల చేశారు. మొత్తం 775 ఫిర్యాదులు అందగా 772 ఫిర్యాదులను పరిష్కరించగా... 3 ప్రోగ్రెస్‌లో ఉన్నాయని వివరించారు.

- సి–విజిల్ ద్వారా మొత్తం 480 కేసులు నమోదు కాగా అందులో 299 నిజనిర్ధారణ కాగా, 181 నిరాధారమైనవిగా గుర్తించడమైంది.
- ఎఫ్ఎస్‌టి., ఎస్ఎస్‌టి., పోలీసు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్స్ ద్వారా చేపట్టిన సీజర్ మేనేజ్మెంట్ ప్రక్రియ ద్వారా ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,98,44,265ల మేర నగదు, రూ.7,72,82,080ల విలువైన లిక్కర్, ఇతర వస్తువులను సీజ్ చేయడం జరిగింది. అలాగే 1,268 ఎఫ్ఐఆర్ కేసులు నమోదు చేయడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రారంభమైన పుష్పగిరి బ్రహ్మోత్సవాలు

వల్లూరు : పవిత్ర పుణ్యక్షేత్రమైన పుష్పగిరిలోని శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి , శ్రీ లక్ష్మీ చెన్న కేశవ స్వాముల బ్రహ్మోత్సవాలు సోమవారం రెండు ఆలయాల్లో నిర్వహించిన ధ్వజారోహణం కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ నిర్వహించారు. వైద్యనాథునికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవికి కుంకుమార్చన చేశారు. రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాన్ని నిర్వహించారు. నందీశ్వరుని చిత్ర పటాన్ని ధ్వజ స్థంభంపై అధిష్టింప చేశారు. రాత్రి హంస వాహనంపై శ్రీ కామాక్షీ వైద్యనాథ స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు.

- కొండపైన గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో తెల్లవారు జామున సుప్రభాత సేవ జరిగింది. అనంతరం ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో విశ్వక్సేన పూజను నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలతో ప్రారంభించి గరుడుని చిత్ర పటాన్ని ధ్వజ స్థంభంపై అధిష్టింప చేశారు. అనంతరం కొండపై నుంచి వారిని తిరుచ్చి వాహనంలో మోస్తూ గ్రామ మాడ వీధుల్లో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.



హంస వాహనంలో శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి



శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న పండితులు

పూజా కార్యక్రమాల్లో శ్రీ వైద్యనాథ స్వామి ఆలయ ధ్వజస్తంభ దాత మీగడ శేషారెడ్డి పాల్గొన్నారు.

పుష్పగిరిలో నేడు

బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం శ్రీ వైద్యనాథేశ్వర స్వామి ఆలయంలో ఉదయం రుద్రాభిషేకం, కుంకుమార్చన జరుగుతాయి. రాత్రి స్వామి వారికి సింహవాహన సేవ జరుగుతుంది. శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకం, తోమాల సేవ ఉంటుంది. రాత్రి స్వామివారికి హంసవాహన సేవ జరుగుతుంది.

క్రికెట్ ఎంపికలకు విశేష స్పందన



ఎంపికల్లో పాల్గొన్న క్రీడాకారులు



ఎంపికలను పరిశీలిస్తున్న సీఏవైడీ ప్రతినిధులు, సెలెక్టర్లు

- 240 మంది క్రీడాకారులు హాజరు
- ప్రాబబుల్స్ ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి క్రికెట్ ఎంపికలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించింది. సీనియర్స్, అండర్–23, అండర్–19 విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికలను క్రికెట్ అసోసియేషన్ ఆఫ్ వైఎస్‌ఆర్ డిస్ట్రిక్ట్ జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డిప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు క్రమశిక్షణ, అంకితభావం అవసరం అన్నారు. ప్రతిరోజూ సాధన చేయడం ద్వారా మీరు అనుకున్న లక్ష్యాన్ని సాధించగలరని సూచించారు. ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులను తొలుత ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసి మ్యాచ్‌లు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను తుది జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. అనంతరం ఎంపికలు నిర్వహించి ప్రాబబుల్స్‌కు ఎంపిక చేశారు. సీనియర్ విభాగంలో 50 మందికి గాను 32 మందిని, అండర్–23 విభాగంలో 70 మందికి గాను 42 మందిని, అండర్–19 విభాగంలో 120 మందికి గాను 60 మందిని ప్రాబబుల్స్‌కు ఎంపిక చేసినట్లు సెలెక్టర్లు తెలిపారు. ఎంపికలను సెలెక్టర్లు నజీర్ అహ్మద్, అబ్దుల్ ఫరూఖ్ రెహమాన్, శివప్రసాద్, ఆనంద్‌కుమార్, పైడికాల్వ విజయ్‌కుమార్, మణికుమార్‌రెడ్డి, విష్ణుప్రసాద్ పరిశీలించారు. కార్యక్రమంలో సీఏవైడీ సంయుక్త కార్యదర్శి ఎం. సాయిపృథ్వితేజ్, సిరాజుద్దీన్ దొలా, సంజయ్‌కుమార్‌రెడ్డి, మునికుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక కొర్రపాడు రోడ్డులో ఐస్‌క్రీం వ్యాపారం చేస్తున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓంప్రకాష్ (32) రెండేళ్ల నుంచి ఐస్‌క్రీం వ్యాపారం చేసుకొని జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో అతను సోమవారం ఐస్‌క్రీం ఫ్యాక్టరీలో తన వాహనానికి ఉన్న చార్జింగ్ వైర్ తీస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలింది. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యుడు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.